క్లుప్తంగా

మద్దిలమ్మ ఆలయంలో పూజలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో మద్దిలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా పద్మశాలీల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం వద్దే వంటావార్పు చేసుకుని వనభోజనాలు చేయటం ప్రత్యేకత. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్లు చైతన్య చౌహన్, బుక్క మహేష్, కుమ్మరి రాజులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదానం చేయడం ఎంతో అదృష్టం



రాజాపూర్: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి దురదుష్టవశాత్తు మతిస్థిమితం కోల్పోయి సత్తేశ్వరా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అభాగ్యులకు అన్నదానం చేయడం ఎంతో గొప్ప అదృష్టమని సత్యేశ్వర ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం రాజాపూర్ మండలం రాయపల్లి గ్రామానికి చెందిన దివంగత నారాయణ స్మారకార్థం ఆయన తమ్ముడు కావలి రవీందర్ సత్యేశ్వర ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై మతిస్థిమితంలేక తిరుగుతున్నటువంటి వారికి ఆశ్రయం కల్పించి వారికి సపర్యాలు చేసి ఆస్పత్రిలో చూయించి, వారు తిరిగి మామూలు మనుషుల అయిన వందకుపైగా తిరిగి వారిని వారి కుటుంబసభ్యుల వద్దకు చేర్చడం జరిగిందన్నారు. అన్నదానం చేసిన వారిని ఆయన శాలువా మెమోంటోతో సన్మానించారు. కార్యక్రమంలో రవికుమార్, ఉదేష్‌గౌడ్, గణేష్ పాల్గొన్నారు.

జీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈమేరకు నూతన అధ్యక్షుడిగా సాజిద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా బీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు చంద్యానాయక్, నరసింహులు, సంతోష్‌రెడ్డి, దివాకర్‌లను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మాదిగల కృతజ్ఞత సభ జయప్రదం చేద్దాం



జడ్చర్ల టౌన్: ఎస్సీ వర్గీకరణకు సహకరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈనెల 22న మాదిగల కృతజ్ఞత సభ ద్వారా అభినందనలు తెలిపేందుకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు దశాబ్దాల కల నెరవేరిన సందర్భంలో ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి మాదిగబిడ్డపై ఉందన్నారు. అందుకే రవీంద్రభారతిలో జరిగే సభకు తరలి రావాలని కోరారు. సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. పట్టణానికి చెందిన దేపల్లి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ కన్వీనర్ డా.నర్సింహారావు, యాదయ్య అంబేడ్కర్ యువజన సంఘాల సభ్యులు కొంగళి రామస్వామి, తప్పెటి బాలు, దేపల్లి నరేష్, కొంగళి రాందాస్, శేఖర్, బాలు, దేపల్లి కృష్ణ పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి!

- అర్ధాంతరంగా నిలిచిన గదుల నిర్మాణం
- చెట్టు కింద, వరండాలో బోధన
- తరగతి గదుల్లేక విద్యార్థుల అవస్థలు
- ఆరుబయటే మధ్యాహ్న భోజనం



చెట్టు కింద కొనసాగుతున్న విద్యార్థుల తరగతులు

దేవరకద్ర రూరల్: అహ్లాదకరమైన వాతావరణంలో చదవాల్సిన విద్యార్థులు అవస్థల మధ్య పాఠాలు నేర్చుకుంటున్నారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో చెట్ల కింద, వరండాలో చదువులు కొనసాగిస్తున్నారు. పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల వెనక్కి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు ప్రహరీ లేని పాఠశాలలో పందుల సంచారం మధ్య తమ చదువులు, భోజనాలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి..

మండల కేంద్రంలోని హరిజన్‌వాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలను 30 ఏళ్ల క్రితం నిర్మించారు. అది పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో 2023, ఆగస్టు 20న 'భయం గుప్పిట్లో చదువులు' అనే శీర్షికతో సాక్షిలో కథనం వచ్చింది. ఈ కథనానికి స్పందించిన అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మొదటి విడతలోనే 'మనఊరు-మనబడి' పథకం కింద ఎంపిక చేసి భవనం నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.47 లక్షలు కేటాయించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో టెండర్ రద్దు చేసి మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. భవనం కూల్చివేత అనంతరం రెండో కాంట్రాక్టర్ సైతం పనుల నుంచి తప్పుకోవడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పెండింగ్ పనుల విషయంపై అటు అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కేటాయించిన నిధులు సైతం వెనక్కి వెళ్లినట్లు తెలుస్తోంది.

70 మందికి ఒకే గది..

పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కొనసాగుతుండగా గతంలో ఇక్కడ 130 మంది విద్యార్థులు ఉండేవారు. గదులు లేకపోవడంతో తల్లితండ్రులు తమ పిల్లలను ఇతర పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు ఉన్నారు. అందరికి ఒకే గది ఉండటంతో చదువులు చెట్ల కింద, వరండాలో కొనసాగిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ సైతం లేకపోవడంతో పందులు, కుక్కలు పాఠశాల లోపలికి వస్తున్నాయి. మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం సైతం వాటి మధ్యే సాగుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పాఠశాలను కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

తరగతి గదులు నిర్మించాలి



పాఠశాలలో విద్యాబోధన చాలాబాగుంది. మా పిల్లలు ఇద్దరు ఇక్కడే చదువుతున్నారు. కానీ సరిపడా గదులు లేక ఆరుబయట చదువుకుంటున్నారు. దీనివల్ల చదువుకోలేకపోతున్నామని పిల్లలు చెప్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సలోమి, విద్యార్థుల తల్లి

ఇబ్బందులు పడుతున్నారు..



గతంలో ఇక్కడ చదువుకునే చాలామంది పిల్లలు గదులు లేకపోవడంతో మరో పాఠశాలకు వెళ్లిపోయారు. పాఠశాల మా ఇంటికి దగ్గరగా ఉండటంతో మా పిల్లల చదువులు ఇక్కడే సాగుతున్నాయి. 5 తరగతులు ఉన్నా ఒకే గది ఉంది. చదువు విషయంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

– లక్ష్మి, విద్యార్థి తల్లి

ఉపాధ్యాయులకు సన్మానం



జీహెచ్‌ఎంలను సన్మానిస్తున్న ఏఎంఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల స్కూల్ అసిస్టెంట్లుగా ఉండి జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన పలువురిని సోషల్‌ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా సేవలందించి జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ఇబ్రహీం, చిన్న కిష్టయ్య, లక్ష్మణ్‌గౌడ్, నరసింహ, జనార్దన్, కృష్ణారెడ్డి, రవిబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

18న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు 18న జిల్లా కేంద్రంలోని క్రాస్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలను జిల్లా కేంద్రంలోని నవభారతి విద్యాలయానికి ఈనెల 17లోగా పంపించాలని సూచించారు.

యోగా టీచర్‌కు సన్మానం

మహబూబ్‌నగర్ క్రీడలు: యోగా టీచర్‌గా సేవలు అందిస్తున్న జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్‌ను సికింద్రబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సన్మానం చేశారు. అదే విధంగా ఈ ఏడాది జూన్ 20న ఎల్‌బీ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. సాయికుమార్‌ను జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.సురేష్, కోశాధికారి యూ.సురేష్ అభినందించారు.

యూరియా కోసం రైతుల ధర్నా



లాల్‌కోట ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు



మన్యంకొండ స్టేజీలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఎదుట వరుసలో ఉంచిన చెప్పులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా రైతులను యూరియా కొరత వేధిస్తోంది. నెల రోజులుగా రైతులకు సరిపడ యూరియా అందడం లేదు. ఉదయం నుంచే ఆగ్రోస్ కేంద్రాలు, రైతు వేదికలు, ఫర్టిలైజర్ దుకాణాలు, సొసైటీ కార్యాలయాలు.. ఇలా ఎక్కడ యూరియా విక్రయిస్తున్నారని తెలిస్తే అక్కడ రైతులు లైన్లు కడుతూ పాట్లు పడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మన్నెంకొండ స్టేజీ వద్ద ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఎదుట రైతులు గంటల తరబడి రైతులు లైన్‌లో నిల్చున్నారు. ఒక్కరికి రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని, సరిపడా యూరియా వస్తుందని అధికారులు తెలిపారు.

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట గ్రామంలో ఆదివారం రైతులు యూరియా కొసం రోడ్డుపై ధర్నా చేశారు. గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రానికి 300 బస్తాల యూరియా వచ్చింది. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నారు. అధికారులు మధ్యాహ్నం నుంచి రైతులకు యూరియా అందించారు. ఒక రైతుకు ఒక యూరియా బస్తా చొప్పున ఇచ్చారు. అధికారులు కొంతసేపు యూరియా పంపిణీ నిలిపేసి కార్యాలయం నుంచి బయటికి వెళ్లిపోయారు. దీంతో కార్యాలయంలో యూరియా ఉంచుకొని రైతులకు ఇవ్వకుండా వెళ్లిపోతున్నారని రైతులు కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం అధికారులు తిరిగొచ్చి టీ తాగేందుకు వెళ్లామని రైతులకు నచ్చజెప్పి యూరియ బస్తాలను అందించారు.

మిడ్జిల్: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మండలంలోని సహకార సంఘం, హకా సెంటర్, రైతు ఆగ్రోస్ కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేశారు, యూరియా కోసం రైతులు ఉదయం నుంచి క్యూ లైన్‌లో నిలిచి ఉన్నారు. ఒక రైతుకు రెండు బస్తాల యూరియా సరఫరా చేశారు. రైతులను దృష్టిలో ఉంచుకోని అధిక మొత్తంలో యూరియా కేటాయించాలని మండల రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



భూత్పూర్: మున్సిపాలిటీ ప్రజలు ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మజీద్‌ల నుంచి భూత్పూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాహిత ఉన్నత పాఠశాలలో లైన్స్ క్లబ్ ఆఫ్ పాలమూరు వారు జామీయా మజీద్, మదీన్ మజీద్, రహమత్ నౌజవాన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ఎస్ఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. శనివారం రాత్రి జాగరణతో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ముస్లిం యువకులు 50మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో షరిఫోద్దీన్, అహ్మద్, యాసీన్, ఖాశీం, జహంగీర్, నయ్యూం, అఫ్సర్, జమీర్, అసద్, సాబేర్, రహమత్, అక్తర్, ఖాదరీ, ఖదీర్, షబ్బీర్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 120 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో మొత్తం 120 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కో ఆర్డినేటర్ గాజుల శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. భారతీయ సంస్కృతిలో గురువులకు గొప్ప గౌరవం ఉందని, వారు సమాజానికి మార్గనిర్దేశకులుగా పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర కుమార్, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, శశికాంత్, చెన్నకిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరడమే లక్ష్యం



గండేడ్: విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవడమే గురువుల లక్ష్యమని రిటైర్డు డిప్యూటీ డీఈఓ భద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో 2003–2004 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులు ఎపుడు కూడా శిష్యుల శ్రేయస్సు కోరడంతో పాటు వారికి దశదిశ నిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు రాములు, బుగ్గయ్య, షేక్‌అలీ, కృష్ణయ్య, మొగులయ్య పూర్వ విద్యార్థులు తెలుగు రవీందర్, జంగం నాగరాజ్ పాల్గొన్నారు.

మైసమ్మ చెంత జన జాతర

నవాబుపేట: మైసమ్మ చెంత జనజాతర కొనసాగింది. ఆదివారం అమ్మవారి చెంత భక్తులు పెద్దఎత్తున పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని కాకర్లపహాడ్ పంచాయతీ పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయానికి ఆదివారం వేలాది మంది తరలివచ్చారు. బోనంతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడితో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.



ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరు!





ముదిరెడ్డిపల్లి నుంచి మహిళలను ఎక్కించుకుని జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్తున్న ఆటో

రాజాపూర్: పరిమితికి మించి ఆటోలో మహిళలను ఎక్కించుకుని జాతీయ రహదారిపై రాంగ్ రూట్లో వెళ్లడం ప్రమాదమని తెలిసినా, ఆవేవి ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు పట్టవు. రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి, రంగారెడ్డిగూడ ఎక్స్‌రోడ్ల నుంచి సమీపంలో ఉన్న సెజ్‌లోని పరిశ్రమల్లో పని చేసేందుకు వెళ్లే మహిళలను అక్కడ వదిలేందుకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు ప్రతిరోజు ఆటోల్లో వస్తుంటారు. అయితే ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రతిరోజు రాంగ్‌రూట్‌లో వెళ్తుంటారు. పక్కనే సర్వీస్‌రోడ్డు ఉన్న ఆ సర్వీస్‌రోడ్డుపై వెళ్లకుండా ఇలా వెళ్తుంటారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటునే ఉన్నాయి. అయినా వీరు మారడం లేదని రహదారిపై వెళ్లేవారు పేర్కొంటున్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజుల క్రితం మార్కెట్ మాజీ చైర్మన్ ఉమ్మిగారి వెంకటేశ్ తల్లి ఉమ్మిగారి అలివేలమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధితులను ఇంటికెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలస్వామి, నాయకులు వర్మ, రాంపాండు, నర్సింహారెడ్డి, బుచ్చన్న ఉన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం

మెట్టుగడ్డ: జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ప్రెస్‌క్లబ్ కార్యవర్గం పనిచేస్తుందని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రెస్ క్లబ్ ఎన్నికలు అనంతరం జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్‌క్లబ్ అభివృద్ధి ధ్యేయంగానే పనిచేస్తున్నామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరేందర్ చారి, నరేందర్‌గౌడ్ తెలిపారు. అభివృద్ధికి నోచుకోని భవనాన్ని ఆధునీకరిస్తున్నామని, ఎమ్మెల్యే, ముడా చైర్మన్ల సహకారంతో మంచి నీరు ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. బోర్ మోటార్ ప్రారంభించామన్నారు. త్వరలో జనరల్ బాడి మీటింగ్ ఏర్పాటు చేసి అన్ని విషయాలు వెల్లడిస్తామన్నారు.

రెస్టారెంట్ ప్రారంభం



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎన్ఆర్ఐ అన్వర్ బాయ్ నూతనంగా ఏర్పాటు చేసిన సిరి ప్యూరు వెజ్ రెస్టారెంట్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారేపల్లి సురేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఒలంపిక్స్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ఎన్‌పీ వెంకటేష్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఉమర్, చిన్న, నాయకులు ఆర్‌పీ వెంకటేష్, మైత్రి యాదయ్య, ఆంజనేయులు, మురళి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బంగ్ల



నవాబుపేట: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కారుకొండ గ్రామానికి చెందిన బంగ్ల రవీందర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తంరెడ్డి, పెద్ది పెంటయ్యలు బంగ్ల రవికి నియామక పత్రం అందించారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో డీసీసీ జర్నల్ సెక్రటరీగా, పీసీసీ రాష్ట్ర సభ్యుడిగా గతంలో పని చేశారు. తాజాగా ఆయనకు సంఘం అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు చెన్నయ్య, వెంకట్రాములు, నారాయణ, తిర్పతయ్య, రాజేందర్, తదితరులు అభినందనలు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే!

- రోడ్డు గోతులమయం.. రాకపోకలకు ఇబ్బంది



జడ్చర్ల–కల్వకుర్తి 167 జాతీయ రహదారి నుంచి తండాకు వెళ్లే రహదారి పూర్తిగా గోతుల మయం

మిడ్జిల్: మండలంలోని లింభ్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జడ్చర్ల–కల్వకుర్తి 167 జాతీయ ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గోతుల మయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందని తండావాసులు ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల ముందు 167 జాతీయ రహదారి నుంచి తండాకు వెళ్లే ప్రధాన రహదారి 2.5 కి.మీ. బీటీ రోడ్డు చేస్తున్నట్లు గతంలో శంకుస్థాపన చేశారు. రెండేళ్లు దాటినా, నేటికి రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రధాన రహదారి గోతుల మయంగా మారింది. చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. వర్షం వచ్చిందంటే స్కూల్ బస్సులు తండాకు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించి త్వరగా బీటీ రోడ్డుగా మార్చాలని తండా వాసులు కోరుతున్నారు.